సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం, 19, మార్చి, 2025




భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. **పదో తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో భక్తుల రాక తగ్గింది.**



వేసవి తాపానికి ఉపశమనం

ఎండలు పెరగడంతో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాటి ముంజెలు, పుచ్చకాయలు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహరి గురువారం (ఉదయం)
భీమవరం	6.20	4.48
నరసాపురం	6.21	4.46
తాడేపల్లిగూడెం	6.15	4.56

న్యూస్‌రీల్

'ఎన్‌ఎల్‌ఆర్‌-3238'తో మంచి దిగుబడులు



కుప్పనపూడిలో ఎన్‌ఎల్‌ఆర్ 3238 వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆకివీడు: కొత్త వరి వంగడం ఎన్‌ఎల్‌ఆర్ 3238 వంగడం దాళ్వాలో అద్భుత ఫలితాల్ని ఇవ్వనుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని కుప్పనపూడిలో రైతు నంద్యాల చల్లారావు పొలంలో వరిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఒక మినీ కిట్ చొప్పున నూతన వంగడాల్ని జిల్లా అంతటా పంపిణీ చేసినట్లు చెప్పారు. మధ్యస్థ సన్నాలుగా ఉన్న వీటిని తెలంగాణా సన్నాలను పోలి ఉంటాయన్నారు. గర్భిణులకు ఈ బియ్యం మంచివన్నారు. 50 బస్తాలకు పైబడి దిగుబడి వస్తుందని చెప్పారు. ఇంతవరకూ సాగులో ఏ విధమైన తెగుళ్లు లేవని.. పల్లపు ప్రాంతాల్లో 45–50 బస్తాలు, మెట్ట ప్రాంతంలో 50–60 బస్తాల పైగా దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత దాళ్వా సాగు ఆశాజనకంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓ ఎమ్మార్పీ ప్రియాంక, రైతు నంద్యాల చల్లారావు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓగా గీతాబాయి బాధ్యతల స్వీకరణ



జి.గీతాబాయి

భీమవరం(ప్రకాశంచౌక్): డీఎంహెచ్‌ఓగా డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ డి.మహేశ్వరరావు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భానునాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం రెగ్యులర్ డీఎంహెచ్వోగా గీతాబాయికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అట్టడుగు వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

వర్గీకరణను నిరసిస్తూ ఆందోళన



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన

భీమవరం: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల నాయకులు కోనా జోసెఫ్, చీకటిమిల్లి మంగరాజు, గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వర్గీకరణ వల్ల మాల, మాదిగల్లో విభేదాలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మీసాల జైరాజ్, కేసీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 20న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈది రవికుమార్, బేతాల కమలాకర్, గాతల సందీప్, గొల్ల రాజ్ కుమార్, అంబటి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాల్యుయేషన్‌లో మినహాయింపునివ్వాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీల విషయంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు, గర్భిణులు, బాలింతలు, 60 ఏళ్ల వయస్సు పైబడిన ఉపాధ్యాయులకు డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. మంగళవారం డీఈవో నారాయణను కలిసి వినతిపత్రం అందచేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల కొందరికి వాల్యుయేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

హైవేపై నెత్తుటి ధారలు



ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతంగా అధికారులు గుర్తించిన ఏలూరు ఆశ్రం జంక్షన్

ప్రమాద ఘంటికలు
- రక్తసిక్తంగా జాతీయ రహదారులు
- పట్టించుకోని ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులు
- పది రోజుల్లో ఆరుకు పైగా ప్రమాదాలు
- ఏడుగురు దుర్మరణం
- భద్రతా చర్యలు, ముందస్తు జాగ్రత్తలు శూన్యం

రహదారులు రక్తసిక్తమవుతున్నాయి.. రోజు రోజుకూ ప్రమాదాలకు జిల్లాలోని జాతీయ రహదారులు కేంద్ర బిందువుగా మారుతున్నాయి.. పది రోజుల వ్యవధిలో ఆరుకుపైగా ప్రమాదాలు జరగ్గా, రెండు భారీ ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారుల నుంచి మంత్రుల వరకు మొక్కుబడిగా హడావుడి చేయడం తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. బ్లాక్ స్పాట్ల వద్ద జాగ్రత్తలు, సూచిక బోర్డుల ఏర్పాటు, రహదారి స్థితిగతులపై కనీస పర్యవేక్షణ వంటి ప్రాథమిక అంశాలపై కూడా దృష్టి సారించడం లేదు.

ఎన్‌హెచ్ 16	ఎన్‌హెచ్ 216 (ఏ)
హనుమాన్ జంక్షన్ నుంచి భీమడోలు మండలం వరకు.. రోజుకు సగటున	గుండుగొలను జంక్షన్ నుంచి సిద్ధాంతం వరకు.. రోజుకు సగటున
35,000	25,000
పైగా వాహనాల రాకపోకలు	పైగా వాహనాల రాకపోకలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు కీలక జాతీయ రహదారులు ఉన్నాయి. ఎన్‌హెచ్‌-16, ఎన్‌హెచ్ 216 (ఎ) మీదుగా అత్యధిక రాకపోకలు జరుగుతుంటాయి. ఆయా రహదారుల్లో నెలకు సగటున 20 నుంచి 25 వరకు ప్రమాదాలు జరుగుతుండగా.. 10 మందికిపైనే మృత్యువాతపడుతున్నారు. ఎన్‌హెచ్‌-216 (ఎ)లో ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్‌-16 మీదుగా రోజుకు 25 వేల వరకు నాలుగు చక్రాలు, ఆపై వాహనాలు, 12 వేల వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎన్‌హెచ్‌-216 (ఎ) మీదుగా సగటున 15 వేలకుపైగా నాలుగు చక్రాలు, ఆపై వాహనాలు, 10 వేలకు పైగా ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

34 బ్లాక్ స్పాట్లు

ఏలూరు జిల్లాలో తరుచూ ప్రమాదాలు జరిగే, అత్యంత సంక్లిష్టంగా ఉండే 34 ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఇలా గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగు స్థలం నెమ్మదిగా వెళ్లాలని సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలి. అలాగే వాహనాల వేగాన్ని తగ్గించడానికి రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం, రేడియం స్టిక్కర్లు, హైవే, పోలీస్ పెట్రోలింగ్ లాంటివి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. అయితే జిల్లాలో ఒక్క చోట కూడా మచ్చుకైనా అలాంటి పరిస్థితి లేదు.

టోల్ వసూళ్లకే పరిమితమవుతూ..

జాతీయ రహదారిపై గతంలో టోల్ వసూలు చేసే కంపెనీలే కొంతమేర రహదారి మరమ్మతులు నిర్వహించేవి. అయితే ఇటీవల కాలంలో టోల్‌ప్లాజాలు కేవలం టోలు వసూలు మినహా మిగతా అంశాలతో సంబంధం లేనివిధంగా పనిచేస్తున్నాయి.

గన్నవరం సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ నుంచి కలపర్రు టోల్‌గేటు వరకు ఒక సంస్థ, పాత టోల్‌గేటు నుంచి గుండుగొలను వరకు మరో కంపెనీకి మరమ్మతులు, ఇతర రహదారుల నిర్వహణ బాధ్యతను నేషనల్ హైవే అథారిటీ కట్టబెట్టింది. అయినా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరువయ్యింది. రహదారులపై పలుచోట్ల గోతులు, ప్రమాదకర మలుపు ఉండటం, అలాంటి చోట్ల కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

అతి వేగం.. ప్రమాదాలకు కారణం

రాత్రిళ్లు, వేకువజామున ప్రైవేట్ ట్రావెల్స్, ఇతర వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. 60 నుంచి 80 కిలోమీటర్ల వరకు స్పీడ్ లిమిట్ కాగా 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి.

పచ్చదనం కరువు

డివైడర్లల్లో తప్పనిసరిగా మొక్కలు పెంచాలి. మొక్కలు దట్టంగా పెంచడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ ఇబ్బందులు తగ్గడంతో పాటు వాహనాల నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను ఇస్తాయని గన్నేరు, ఇతర మొక్కలు పెంచాల్సి ఉంది. కలపర్రు నుంచి గుండుగొలను వరకు ఎక్కడా పచ్చదనం కనిపించని పరిస్థితి.

ప్రమాదాలు ఇక్కడే ఎక్కువగా..

దెందులూరు చెక్‌పోస్టు నుంచి ఆశ్రం, గుండుగొలను నుంచి సత్యనారాయణపురం, ఆశ్రం జంక్షన్, నోవా ఇంజినీరింగ్ కాలేజీ వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. ప్రమాదాలు కూడా ఎక్కువగా ఇక్కడే జరుగుతున్నాయి.

సమన్వయ లోపం

నేషనల్ హైవే అథారిటీ, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయ లోపం మరో ప్రధాన సమస్య. అలాగే వరుస ప్రమాదాలు జరుగుతున్నా పోలీస్ యంత్రాంగం సీరియస్‌గా స్పందించడం లేదు. కనీసం పోలీస్ శాఖపరంగా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పరిస్థితి కొంత మెరుగవుతుంది.

అన్ని చర్యలూ తీసుకుంటాం



రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవడానికి వీలుగా నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతున్నాం. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తాం

– షేక్ కరీమ్, ఉప రవాణా కమిషనర్, ఏలూరు



రత్నా దాబా వద్ద ధ్వంసమైన రెయిలింగ్



రెస్ట్ తీసుకుంటున్న రోడ్డు సేఫ్టీ అధికారులు





పనిచేయని సూచిక స్క్రీన్, స్పీడ్ మీటర్



బోర్డు సరే.. చర్యలేవీ



అనధికారికంగా పెట్రోల్ బంకుకు దారి



రహదారిపైనే నిలిపివేసిన లారీ



సోమవరప్పాడు వద్ద ధ్వంసమైన వంతెన

రోడ్డున పడ్డ హెల్త్ అసిస్టెంట్లు

- 920 మందిని తొలగించిన కూటమి సర్కారు
- కాంట్రాక్టు ఉద్యోగులుగా రెండు దశాబ్దాలకు పైగా సేవలు
- వీరిలో పలువురు ఐదారేళ్లలో రిటైరయ్యేవారే..
- ఉద్యోగాలు పోవడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



సాక్షి, భీమవరం: రెండు దశాబ్దాలకు పైగా కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లుగా ప్రజలకు వైద్య సేవలందించిన వారిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది. వీరిలో మరో ఐదారేళ్లలో రిటైరయ్యేవారు ఎంతో మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తుందని గంపెడాశతో ఎదురుచూస్తున్నవారికి ఊహించని షాక్ ఇచ్చింది. కోర్టు తీర్పును సాకుగా చూపించి రాష్ట్ర వ్యాప్తంగా 920 మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగించడంతో వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు.

జాబు కావాలంటే బాబు రావాలంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాలివ్వకపోగా ఉన్న ఉద్యోగులను తొలగించే పనిలో పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవల కోసం పారామెడికల్ రిక్రూట్‌మెంట్ ద్వారా హెల్త్ అసిస్టెంట్ల (మేల్) నియామకానికి 2002 మే నెలలో నాటి ఉమ్మడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2324 పోస్టులకు 10వ తరగతి పూర్తి చేసి హెల్త్ అసిస్టెంట్ ట్రైనింగ్ డిప్లమో ఉండడాన్ని విద్యార్హతగా ప్రకటించింది. పరీక్షకు 10వ తరగతి వారితో పాటు ఇంటర్ పూర్తి చేసి హెల్త్ అసిస్టెంట్ శిక్షణ పొందినవారు హాజరయ్యారు. జాబు రాని ఇంటర్ విద్యార్థులు కోర్టున్ను ఆశ్రయించడంతో 2006లో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ మేరకు సుమారు వెయ్యి మందిని హోల్డ్‌లో పెట్టి ఇంటర్ చదివిన వారిని విధుల్లోకి తీసుకున్నారు. తదనంతర పరిణామాలతో వారిని చేర్చుకోవడంతో ఉద్యోగుల సంఖ్య దాదాపు 3324కు చేరింది. నోటిఫికేషన్ మేరకు 2324 మంది ఉద్యోగులు మాత్రమే ఉండాలని 2012లో కోర్టు తీర్పు ఇవ్వడంతో అదనంగా ఉన్న వెయ్యి మందిని తొలగించారు. వీరంతా ఆందోళన బాట పట్టడంతో అప్పటి ప్రభుత్వం మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకుంది.

ఆగమేఘాలపై తొలగింపు :

మార్కులు తక్కువ వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చారంటూ అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోనే కొందరు హైకోర్టును ఆశ్రయించారు. డీ మెరిట్ ఉద్యోగులను తొలగించి వారికంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి న్యాయం చేయాలని గత నవంబర్ 29న తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిని సాకుగా చూపించి కోర్టు ఇచ్చిన 90 రోజుల గడువును పట్టించుకోకుండా తీర్పు వచ్చిన వారంలోపే ఆగమేఘాలపై డిసెంబరు 5, 6 తేదీల్లో ఉన్నతాధికారులు 920 మందిని తొలగించేశారని బాధిత ఉద్యోగులు చెబుతున్నారు. తెలంగాణలోని 280 మంది కాంట్రాక్టు ఉద్యోగులను అక్కడి ప్రభుత్వం నేటికీ కొనసాగిస్తుండటం గమనార్హం.

రోడ్డున పడ్డ కుటుంబాలు

రూ.3550 జీతానికి ఉద్యోగంలో చేరి ప్రస్తుతం రూ.30,200 జీతం అందుకుంటున్న 920 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు, వారి కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు 70 మందికి పైగా ఉన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేశామని, క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించడంలో రెండు దశాబ్దాలకు పైగా కీలకంగా పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిందని వాపోతున్నారు. కోర్టు తీర్పు అమలుచేశామని చెబుతున్న పాలకులు, అధికారులు కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలో న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో తమ ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయని ఎదురుచూస్తుంటే ఉన్న వాటిని తొలగించడం దారుణమంటున్నారు. ఉద్యోగాలు పోయిన బాధతో గుంటూరు, ఉత్తరాంధ్రలోని ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు గుండెపోటుతో ప్రాణాలను కోల్పోయినట్టు తెలిపారు.

నిర్దాక్షిణ్యంగా తొలగించారు



హైకోర్టు ఆదేశాల మేరకు 90 రోజుల గడువు ఉన్నప్పటికీ వారం లోపే తొలగిస్తూ ఆదేశాలిచ్చారు. ఇదెక్కడి న్యాయమని అధికారులు, పాలకులను అడిగితే పొంతన లేకుండా మాట్లాడుతున్నారు. ఉన్నత స్థాయిలోని కొందరు చేసిన తప్పులకు మా కాంట్రాక్టు ఉద్యోగులను బలిపశువులను చేశారు.

– సయ్యద్ జఫ్రుల్లా, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నేత

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 60 భవనాల మంజూరు
- 6 భవనాలు ప్రారంభించగా.. 5 భవనాలు 100 శాతం పూర్తి
- వివిధ దశల్లో మిగతా భవనాలు
- వాటిని పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



పాలకొల్లు మండలం పూలపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ భవనం

గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ భవనాల మంజూరు ఇలా..

మండలం	భవనాల నిర్మాణం	మండలం	భవనాల నిర్మాణం
ఆచంట	7	యలమంచిలి	4
పెనుగొండ	1	పెంటపాడు	3
పెనుమంట్ర	2	తాడేపల్లిగూడెం	2
పోడూరు	9	అత్తిలి	4
భీమవరం	2	ఆకివీడు	1
వీరవాసరం	2	కాళ్ల	1
మొగల్తూరు	10	పాలకోడేరు	2
నర్సాపురం	2	గణపవరం	4
పాలకొల్లు	4		

భీమవరం(ప్రకాశం చౌక్): నాడు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నాడు–నేడు పథకంలో పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాకు రూ.9.72 కోట్లు కేటాయించి 60 భవనాలను మంజూరు చేశారు. భవన నిర్మాణంతో పాటు ఫర్నీచర్, కిచెన్, హాలు, క్లాస్ రూమ్, టాయిలెట్ తదితర సౌకర్యాలు కల్పించారు. ఒక్కో భవనానికి రూ.16 లక్షలు వెచ్చించారు. గత ప్రభుత్వం కాలంలో దాదాపు 90 శాతం మేర భవనాలు ప్రారంభించగా.. ఆరు భవనాలను వేగంగా పూర్తి చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించారు. మిగతా భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే వాటిని పూర్తిచేసి అంగన్ వాడీ కేంద్రాలకు అప్పగించడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జిల్లాలో మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 626 సెంటర్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

జగన్ ప్రభుత్వం 90 శాతం భవనాల నిర్మాణం చేపట్టింది. వాటిలో కొన్ని ప్రారంభించగా.. కొన్ని నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగతా భవనాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా.. తమకు ఎందుకన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వం వచ్చి 10 నెలలవుతున్నా భవనాల నిర్మాణం ఊసే ఎత్తడం లేదు. దాంతో అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు నడపాల్సి వస్తోంది. జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు విమర్శలు చేయడం తప్ప జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించాలనే ఆలోచన లేదు.

నాడు చంద్రబాబు 10 ఏళ్ల పాలనలో జిల్లాలో అక్కడక్కడ అరకొర భవనాలు నిర్మిస్తే.. జగన్ తన 5 ఏళ్ల పాలనలో రెండేళ్లు కరోనా వల్ల ఇబ్బంది పడినా.. మూడేళ్లలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం మొదలుపెట్టారు. చంద్రబాబు పాలన వచ్చి 10 నెలలు అవుతున్నా అంగన్‌వాడీలకు కొత్త భవనాలు నిర్మించడం లేదు. పూర్తయిన భవనాలను ప్రారంభించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 6 భవనాలు వినియోగంలోకి వచ్చాయి. 17 భవనాలు 95 శాతం పూర్తయ్యాయి. 13 భవనాలకు శ్లాబ్ పూర్తి చేశారు. మరో 5 భవనాలు 100 శాతం పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణం పూర్తయినవి ప్రారంభించడం లేదు. వివిధ దశల్లో ఉన్న వాటి నిర్మాణం పూర్తి చేయడం లేదు.

మన మిత్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తీసుకొచ్చిన మన మిత్ర వాట్సప్ పౌర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వివిధ సరీస్సులు వారి ఇంటి వద్దనే వాట్సప్ ద్వారా అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వాట్సప్ నెంబర్ 95523–00009తో తొలి విడతలో 161 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తదుపరి దశలో 360 సేవలకు విస్తరించే దిశగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వాట్సప్ ద్వారా అందించే సేవలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వర స్వామి సన్నిధిలో...



క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న యాదగిరి గుట్ట ఆలయ ప్రధానార్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన లక్ష్మీనరసింహాచార్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు. లక్ష్మీనరసింహాచార్యులు మాట్లాడుతూ పెనుగొండ మండలం కొఠాలపర్రులో రామాలయం ప్రతిష్టాపన కార్యక్రమానికి వచ్చానని, క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. స్థానిక ధర్మపరిరక్షణ సమితి సభ్యులు బాకూరి సత్యనిరంజన్, కొమ్మారెడ్డి హిమదత్, జక్కంపూడి కుమార్, తులా రామలింగేశ్వరరావు, శీరం ఆనందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేసీ - శాట్‌లో గాయత్రికి ఆల్ ఇండియా రెండో ర్యాంక్



గాయత్రికి నగదు బహుమతి, జ్ఞాపిక అందజేస్తున్న జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు సిద్ధార్థ

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): నగరంలోని రామచంద్రరావుపేట శ్రీ శర్వాణీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని ముత్యాల గాయత్రి గత సెప్టెంబర్‌లో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జేసీ- శాట్ లెవల్-2 ఆల్ ఇండియా పోటీ పరీక్షల్లో పాల్గొని జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో గాయత్రిని పలువురు అభినందించారు. గాయత్రి ఇటువంటి అద్భుత విజయాలు మరిన్ని సాధించాలని ప్రధానోపాధ్యాయిని సీహెచ్ సత్యశారద ఆకాంక్షించారు. జేసీ-ఐ జాతీయ ఉపాధ్యక్షుడు బీ. సిద్ధార్థ, జోన్- 26 అధ్యక్షుడు ఎంఆర్‌టీ భరత్, జే. ఆదిత్య, ఏలూరు ఐపీపీ కేఎస్ రోహిత్, ఏలూరు జోన్ ఎస్ ప్రెసిడెంట్ అరవింద్ గాయత్రికి రూ.51 వేలు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. పాఠశాల డైరెక్టర్ కే.మదనమోహనరాజు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు


ఆకివీడు: చెరుకుమిల్లి గ్రామ శివారు ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మహిళపై లైంగిక వేధింపులకు యత్నించిన దోనాద్రి నరసన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు మంగళవారం చెప్పారు. ఈ నెల 6వ తేదీన నిందితుడు ఇంటికి రమ్మని భార్యతో ఫోన్ చేయించాడని, తాను ఇంటికి వెళ్లిన సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడేందుకు యత్నించగా అదే సమయంలో తన భర్త ఇంటికి వచ్చి తన కోసం గట్టిగా కేక వేయగా నిందితుడు పరారయ్యాడని మహిళ ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రాణాలతో చెలగాటం.. జీవన పోరాటం



ప్రయాణికులకు జామకాయలు అమ్మేందుకు బస్సు వెంట పరుగులు

పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద కొందరి జీవన పోరాటమిది. కుటుంబ సభ్యులకు కడుపు నిండా భోజనం పెట్టేందుకు జాతీయ రహదారిపై ఇలా తమ ప్రాణాలను పణంగా పెట్టి చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. జామకాయలు, బొప్పాయి, పుచ్చకాయ, వేరుశెనగలు ప్యాకెట్లలో వేసి ఇలా బస్సుల్లో, కారుల్లో ప్రయాణం చేసేవారికి పోటీపడి అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు 300 కుటుంబాల వరకు ఈవిధంగా బతుకు బండి నడుపుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు









వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

- రాత్రివూట ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై మారణాయుధాలతో దాడి
- దాడి చేసి పరారైన గుర్తు తెలియని వ్యక్తులు
- తాటాకులగూడెంలో కలకలం
- బాధితుడి భార్య ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బోసుబాబు



జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో జాగిలాలతో పోలీసుల తనిఖీ

బుట్టాయగూడెం: గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్ సీపీ కార్యకర్తపై మారణాయుధాలతో దాడి చేసి పరారీ కావడం జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో కలకలం రేపింది. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బాధితుడిని తెల్లవారుజామున కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గంథం బోసుబాబు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతడి తలపై దాడి చేసి పరారయ్యారు. తెల్లవారుజామున కుమారుడు అనూప్‌శక్తి గమనించి విషయాన్ని తల్లి శాంతికుమారికి చెప్పడంతో ఆమె వెంటనే తన మరిది వీరాంజనేయులు, కడెల్లి చిన్ని అనే వారికి తెలియజేసింది. వెంటనే బంధువులు రక్తపు మడుగులో ఉన్న బోసుబాబును తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేయడంతో అక్కడికి తరలించి వైద్యం అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐలు బి. వెంకటేశ్వరరావు, బాల సురేష్, ఎస్సైలు నవీన్ కుమార్, చంద్రశేఖర్ దర్యాప్తు చేపట్టారు. బోసుబాబు ఇంటికి జాగిలాలను రప్పించి తనిఖీలు చేశారు. క్లూస్ టీమ్ కూడా వచ్చి వివరాలు సేకరించారు. కాగా అసలు ఏం జరిగిందనే దానిపై పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఇటీవల జీలుగుమిల్లిలో జరిగిన జగదాంబ అమ్మవారి తిరుణాళ్లలో అవకతవకలపై ఒక పత్రికలో వచ్చిన వార్తను వాట్సాప్ గ్రూప్‌లో తన భర్త బోసుబాబు సెండ్ చేసినట్లు అతని భార్య శాంతకుమారి తెలిపారు. ఈ విషయమై జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు ఫోన్ చేసి తన భర్తను నానా దుర్భాషలాడి ఎప్పటికైనా తన భర్తను నరికి చంపుతానని హెచ్చరించారని ఈ విషయం తన భర్త తనతో చెప్పినట్లు తెలిపారు. దీంతో ఈ విషయంపై నాలుగురోజుల క్రితం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. ఈలోపే తన భర్తపై దాడి జరిగిందని దీనిపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్కంఠగా టెన్నిస్ పోటీలు

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో రెక్స్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన పోటీల్లో ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి. 35+ సింగిల్స్ విభాగంలో కన్నన్, నితీష్ జాక్సన్, సంతోష్, జానకి విజయం సాధించారు. 45+ సింగిల్స్ విభాగంలో ఎంవీఎల్ఎన్ రాజు, భాస్కరరావు, సంపత్, మధు, రామ కృష్ణయ్య, ఎంవీ శివ కుమార్ రాజు గెలుపొందారు. 55+ సింగిల్స్ విభాగంలో ఆర్ఎన్ రమేష్, ఎస్ఎస్ రాత్, బీజీ నగేష్, పాల్ మనోహర్ విజయం సాధించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కైకలూరు: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కైకలూరు – గుడివాడ రూటులో గోపవరం గేటు వద్ద మంగళవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు వ్యక్తులు రైలు బోగి గేటు వద్ద ఉన్నారని, వారిలో ఒకరు జారి పడిఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని రైల్వే ప్రొటక్షన్ ఫోర్సు(ఆర్‌పీఎఫ్) సిబ్బంది భీమవరం ఆస్పత్రికి తరలించారు. మృతుడు వయస్సు 35–40 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి వివరాలు బంధువులు వచ్చిన తర్వాత తెలియచేస్తామని రైల్వే పోలీసులు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం



కందుల రమేష్, ఎమ్మార్పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కండ్రిగగూడెంలోని సంఘ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. దళితుల్లో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని అన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళి, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నాగేంద్రబాబు, ఎంఎస్పీ ఏలూరు అధ్యక్షుడు గద్దల ప్రసాద్, ఏలూరు వర్కింగ్ అధ్యక్షుడు గూడూరు రాజేష్ బాబు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

దళిత సేన హర్షం

ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల ఎస్సీల్లోని అన్ని ఉప కులాలకు మేలు జరిగేలా సమాన అవకాశాలు ఏర్పడతాయని ఆకాంక్షించారు.

వేసవి తాపానికి ఉపశమనం

- పుచ్చకాయలు, ముంజెలకు వేసవిలో డిమాండ్
- జోరందుకుంటున్న అమ్మకాలు



గొల్లలకోడేరులో పుచ్చకాయల దుకాణం



తాటి ముంజెలు

బుట్టాయగూడెం/పాలకోడేరు: భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. మార్చి మొదటివారం నుంచే ఒకపక్క తీవ్రమైన ఎండలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాటి ముంజెలు, పుచ్చకాయలు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. పుచ్చకాయ శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు చలువ చేస్తుంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో.. పుచ్చకాయల కొనుగోలుకు ఉత్సాహం చూపిస్తున్నారు. మార్కెట్‌లో కిలో పుచ్చకాయ ధర రూ.20 నుంచి రూ.30 పలుకుతుంది. మన జిల్లాలో సుగర్ బేబీ, నాన్‌దారి, ఆర్కిమెన్ తదితర రకాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

పుచ్చకాయతో ప్రయోజనాలు

పుచ్చకాయలు తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. పుచ్చలో విటమిన్ బి, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం లభించి.. తక్షణ శక్తి నిస్తుంది. ఆల్కలైన్‌తో పాటు పీచు పదార్థం ఉండడం వల్ల మూత్ర పిండాలకు ఎంతో ఉపయోగకరం. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6 శాతం చక్కెర , 30 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, 12 గ్రాముల పొటాషియం, 7 గ్రాముల కాల్షియం ఉంటాయి.

వేసవి తాపం తగ్గించే ముంజెలు

తాటి ముంజెలు ఎండాకాలంలో మాత్రమే లభిస్తుంటాయి. వేసవి తాపాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్య రక్షణలో ఎంతో ఉపయోగపడతాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో, రోడ్ల వెంట తాటి ముంజలు ఏజెన్సీ ప్రాంతంలో విక్రయిస్తూ అనేక మంది వ్యాపారులు కనిపిస్తున్నారు. మార్కెట్‌లో ముంజెల వ్యాపారం చేసే వ్యాపారులకు మార్చి, ఏప్రిల్, మే నెలలో అధికంగా ఆదాయం వస్తుంది. తాటి ముంజలు 12 ముంజెలు రూ.40కు విక్రయిస్తుండగా మరి కొందరు 18 ముంజలు రూ.50 విక్రయిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో సుమారు 75 కుటుంబాలకు పైగా ముంజెలు, తాటి ఆకుల విక్రయాలతో వేసవి కాలంలో జీవనం సాగిస్తున్నారు.

తాటి ముంజెలతో ఉపయోగాలు

- ఎన్ని నీళ్లు తాగినా అలసిపోయివారు.. తాటి ముంజెలు తినడం వల్ల చలాకీగా ఉంటారు.
- తాటి ముంజెల్లో ఏ, బీ, సీ విటమిన్లతో పాటు జింక్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల వ్యక్తుల బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి.
- శరీరంలో శక్తిని పెంచి అలసటను దూరం చేస్తుంది.

ముంజెలతో వేసవిలో మంచి ఆరోగ్యం



వేసవి కాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే తాటి ముంజెలు తినడం మంచిది. ఈ ముంజల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఎండలో తిరిగేవారు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా తాటి ముంజలు ఎంతగానో పనిచేస్తాయి.

డాక్టర్ సుధీర్, వైద్యుడు, బుట్టాయగూడెం సీహెచ్‌సీ

వేసవిలో ఎంతో ప్రయోజనకరం



పుచ్చకాయ వేసవిలో ఆరోగ్యానికి ఎంతో మంచిది. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీనిని తినవచ్చు. వేసవి తాపం నుంచి రక్షణ పొందవచ్చు.

చినమిల్లి రంగమనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు

అనుమానాస్పద స్థితిలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: ఆర్టీసీ డ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణం వీకర్స్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం వీకర్స్‌కాలనీ 4వ వార్డుకు చెందిన గంటా ఆంజనేయ దుర్గాప్రసాద్ (46) ఆర్టీసీ డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. విధుల నిర్వహణలో అలసత్వంగా ఉండటంతో మూడేళ్ల క్రితం అతను సస్పెండ్ అయ్యాడు. దీంతో అతను భార్య, పిల్లలు దూరంగా ఉంటూ వీకర్స్ కాలనీలో ఓ ఇంటిలో ఒంటిరిగా జీవనం సాగిస్తున్నాడు. సస్పెండ్ అయ్యి మూడేళ్లు గడుస్తున్నా ఆర్టీసీ అధికారులు అతడిని ఉద్యోగ విధుల్లోకి తీసుకోలేదు. మంగళవారం ఉదయం ఆంజనేయ దుర్గాప్రసాద్ ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు కిటికీలోంచి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దుర్గాప్రసాద్ ఉరికి వేలాడుతూ ఉండడం, ఎడమ చేయి మణికట్టు తెగి ఉండి రక్తస్రావం కావడం, గదిలో పురుగుల మందు బాటిల్ పడి ఉండడాన్ని పరిశీలించిన పట్టణ సీఐ ఎ సుబ్రహ్మణ్యం అనుమనాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ పథకాలు రైతులకు చేరాలి

ఏలూరు (మెట్రో): ప్రభుత్వం రైతులకు అందించే ప్రతి పథకం రైతులకు చేరువ చేసేలా అధికారులు పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. ఏలూరులో వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంలో అర్హులైన రైతులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉచిత పంట బీమా పథకాన్ని ఖరీఫ్ సీజన్ నుంచి ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి దుక్కులతో లాభాలు





మెట్ట ప్రాంతంలో వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతులు

చింతలపూడి: జిల్లాలోని మెట్ట ప్రాంతంలో వ్యవసాయ భూముల్లో భూసారం దెబ్బతినడంతో దిగుబడులు తగ్గి పోవడం, చీడ పీడల ఉధృతి పెరగడం వంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. రైతులు సరైన సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటిస్తే నష్టాలు తగ్గించుకోవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో 15,792 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, టి.నరసాపురం మండలంలో 2,661 హెక్టార్లల్లో వరి సాగు చేపట్టారు.

వేసవి దుక్కులతో చీడ పీడల నివారణ

వేసవి దుక్కులు పంటలకు ఎంతో ప్రయోజనకరం . సాధారణంగా రైతులు కోతలు పూర్తవగానే పొలాలను అలాగే వదిలేస్తారు. తొలకరి పలకరించగానే సాగుకు సిద్ధమవుతారు. చినుకులు పడగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలోనే దుక్కులు దున్నడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ సూచిస్తున్నారు. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరుగుతాయి. అవి భూమిలోని నీటిని, పోషక పదార్థాల్ని గ్రహించి పెరుగుతాయి. కారణంగా భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోతుంది. భూసారం తగ్గి పోతుంది. రైతు వేసిన పంటకు పోషకాలు లభించవు. వేసవి దుక్కుల వల్ల భూమి లోపలి పొరల్లో దాగివున్న కీటకాల గుడ్లు, శిలీంధ్రాలు బయటకు వచ్చి ఎండ తీవ్రతకు నశిస్తాయి. దుక్కిలో బయటపడిన పురుగులను పక్షులు తినడం వల్ల పంటలకు చీడ పీడల బెడద తప్పుతుంది.

భూసారం పెంచడం ఎలా?

భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చి రొట్ట సాగు చేయాలి. దీనివల్ల భూసారం పెరగడమే కాక చీడ పీడల బెడద తప్పి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలు నివారించడం, నేలలో నివశించే జీవరాశులకు ఆహారంగా, మొక్కలకు కావల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా ఈ పచ్చిరొట్ట పంటలు ఉపయోగపడతాయి.

నేల సారవంతం

భూమిని 25 నుండి 30 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కులు దున్నడం వల్ల నేలలో గాలి లభ్యత పెరిగి సూక్ష్మ జీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థం లభ్యత పెరిగి నేల సారవంతమవుతుంది. భూమికి వాలుగా దుక్కి దున్నడంతో వర్షం కురిసినప్పుడు ఆ నీరు భూమి లోపలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజని వర్షపు నీటితో కలిసి నేలకు చేరడంతో సారవంతంగా మారుతుంది.



బి నాగకుమార్ -ఏడీఏ- వ్యవసాయ సబ్‌డివిజన్

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి విరాళం



తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి ద్వారకానగర్‌లోని శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి గుప్తా మిల్లు స్టోర్స్ అధినేత రూ.10,116లు విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లిఖార్జునరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ట్రస్ట్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో గాలికుంటు వ్యాధి టీకాలు



కృష్ణాపురం గ్రామంలో పాడి ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం పంచాయతీ పరిధి కృష్ణాపురం గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 98 ఆవులు, 236 పాడి గేదెలకు పశువైద్యాధికారి విజయ్‌కుమార్ టీకాలు వేశారు. కుంచనపల్లి గ్రామంలో బుధవారం పాడి పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా పుష్పోత్సవం



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ఏకాంతసేవ, శ్రీ పుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవాలు ముగించారు. ఉదయం వేద పండితులు వేద పారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి పుష్పోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పూలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు మోగంటి వెంకటరమణ శర్మ, సీహెచ్ రాంబాబు, కె.సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఏఎస్ఎన్ఎం విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: మత్తు పదార్థాలు, ధూమపానం మొదలైన చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్, డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉంటూ మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఈగల్ క్లబ్ సభ్యులు డాక్టర్ ఎం.రామకృష్ణ, ఎ.వంశీ సుబ్బరాయన్, అధ్యాపకులు డాక్టర్ యామిని, కె.భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్య, వైద్యానికి ఇబ్బందులు పడుతున్న పేద వారిని ఆదుకోవడంలో రోటరీ క్లబ్ తన సహాయ సహకారాలు అందిస్తున్నారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏ రావాడ సతీష్ అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన గందం నాగరాజుకు ట్రై సైకిల్‌ను అందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నాగరాజు పోలియో వల్ల నడవలేని స్థితిలో ఉన్నాడని అతనికి ట్రై సైకిల్ కావాలని కోరడంతో రూ.12 వేలు విలువ చేసే ట్రై సైకిల్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, కావలి నగేష్, జక్కంపూడి రాంప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- పాఠశాలలో అలంకారప్రాయంగా వాటర్ ప్లాంటు
- పట్టించుకోని అధికారులు



భోజనాలు చేస్తున్న విద్యార్థులు



బయటి నుంచి తెచ్చిన వాటర్ టిన్నులు



నిరుపయోగంగా వాటర్ ప్లాంటు

ఇరగవరం: కొద్దిరోజులుగా ఎండలు మండుతున్నాయి. మండలంలో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్లు నిరూపయోగంగా మారుతున్నాయి. మరికొన్ని చోట్లు ప్రారంభానికి కూడా నోచుకోలేని పరిస్థితి. ఇరగవరం మండలంలోని పలు పాఠశాలలో తాగడానికి నీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంతేరు గ్రామంలోని హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 202 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో గత సంవత్సరం ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయగా అది నేటికి ప్రారంభించకుండానే వదిలేశారు. దీంతో బయటి నుంచి నీటిని కొనుక్కుని డబ్బాలలో తెచ్చుకుంటున్నారు. ప్లాంటుకు కనెక్షన్ ఇవ్వడానికి టెక్నీషియన్ రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రధానోపాధ్యాయురాలు జే.సూర్యకుమారి పేర్కొన్నారు. కావలిపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 144 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురై నెలలు కావస్తున్నా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే వాటర్ బాటిల్స్ తీసుకు వెళ్లుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు వద్ద అర లీటర్, లీటర్ బాటిల్స్ ఉంటున్నాయి. అవి మధ్యాహ్నం భోజనం సమయానికే ఖాళీ అవుతున్నాయి. తిరిగినీటిని నింపేందుకు మోటారు నీరే దిక్కు. నాడు- నేడు పథకంలో భాగంగా రూ. లక్షకు పైగా వ్యయంతో కొనుగోలు చేసిన ఈ వాటర్ ప్లాంట్ అలంకార ప్రాయంగా మారింది. విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. వేసవి వస్తున్నందున ఈ ప్లాట్లు వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటి నుంచే నీరు తెచ్చుకుంటున్నాం



పాఠశాలలో తాగడానికి నీరు లేకపోవడంతో ఇంటి నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. సీసాలోని నీరు అయిపోయాక చాలా ఇబ్బంది పడుతున్నాం.

– జాహ్నవి, 5వ తరగతి

పాడైన ప్లాంటును బాగుచేయాలి



నీటి ప్లాంటును బాగుచేస్తే మాకు ఇబ్బంది ఉండదు. ఇంటి నుంచి ఒక ప్రక్క పుస్తకాలు మరో ప్రక్క నీటి బాటిల్ మోయలేకపోతున్నాను. నేను తెచ్చుకున్న నీటిని స్నేహితులు కూడా తాగేస్తున్నారు.

– సుషాంత్, 6వ తరగతి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



ఏపి నిట్‌లో మాట్లాడుతున్న కార్తికేయశర్మ

తాడేపల్లిగూడెం: విద్యార్థులు వేసే ప్రతీ అడుగు విజయానికి మెట్టు కావాలని ఏపి నిట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. నిట్ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ కార్తికేయశర్మ సెంట్రల్ లైబ్రరీలో మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులను లైబ్రరీలో సమకూరుస్తున్నామన్నారు. ఆధునిక డిజిటల్ యుగంలో అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని ఒడిసి పట్టుకోవాలన్నారు. విజయ శిఖరాలకు సులువుగా చేరడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. సెంట్రల్ లైబ్రరీలో నింబస్ రిమోట్ యాక్సెస్ సాఫ్ట్‌వేర్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం కొన్నివేల పుస్తకాలు, జర్నల్స్‌ను అందుబాటులో ఉంచామని, వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మెరుగైన భవిష్యత్ కోసం కలలు కనే విద్యార్థులకు ఈ నింబస్ సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అసిస్టెంటు లైబ్రేరియన్ డాక్టర్ కమలా మొహంతి అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మణికందన్, సూపరింటెండెంటు కాశీఅన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనల్లో ముద్దాపురం విద్యార్థుల ప్రతిభ



ముద్దాపురంలో విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ×యురేకా సైన్స్ ఎక్స్పో- 2025 (సైన్స్ ప్రయోగాల పోటీ)లో తణుకు మండలం ముద్దాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి నాలుగు బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌బిబి. సుబ్రహ్మణ్యం తెలిపారు. సైన్స్ అండ్ అండ్ టెక్నాలజి విభాగంలో 9వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎ.రాజేష్ ప్రథమ, ఆర్.బాల ఆదిత్య శ్రీ ద్వితీయ స్థానాలు సాధించగా, మూఢనమ్మకాలు–శాస్త్రీయ వైఖరి అనే విభాగంలో 9వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎల్.మంజు, శ్రీ, జి.మాధురిలు ప్రథమ స్థానం, 10వ తరగతి విద్యార్థులు టి.వెంకట కృష్ణ, ఎ.మహేష్, జి.సుమంత్‌లు ద్వితీయ స్థానం సాధించారని తెలుపుతూ ఇటువంటి పోటీలు విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా మార్చే స్ఫూర్తి కలిగిస్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులతోపాటు గైడ్ టీచర్ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బియం .గోపాల రెడ్డిని పధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఒ.మిన్నీ రోజ్, ఎ.దుర్గబాబు, యస్.సురేష్, ఎస్‌వి.స్వామి, డి.యస్.కె.జి.ప్రవీణ్ తదితరులు అభినందించారు.

30 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన 30 మంది వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించారు. అనంతరం వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉచితంగా రక్త, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అడ్డంకిగా మారిన డ్రెయిన్లపై ఆక్రమణలను మంగళవారం మున్సిపల్ విజయసారథి ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. పట్టణంలో డ్రెయిన్లపై ఆక్రమణలు ఉండడంతో కార్మికులకు డ్రెయిన్లను శుభ్రం చేయడం చాలా కష్టంగా ఉంటుంది. వీలైనంత మేరకే డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులను చేపట్టడంతో భారీగా సిల్ట్ పేరుకుపోతుంది. తద్వారా మురుగు సమస్య అధికం అవుతుంది. మురుగునీరు పారుదల లేక కొద్దిపాటి వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు చేరిపోతుంది. అందువల్ల ప్రత్యేక డ్రైవ్ చేపెట్టిన మునిసిపల్ కమిషనర్ మార్కెటింగ్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని వ్యాపారస్తులకు సూచించారు. తమకు తాముగా ఆక్రమణలు తొలగించుకోమని చెబుతున్నారు. వినని పక్షంలో మునిసిపల్ సిబ్బందితో తొలగింపు పనులను చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కోర్టు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఆక్రమణలను తొలగించి సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. మార్కెట్ యార్డు దక్షిణం భాగంలో ఉన్న ఆ ఒక్క డ్రెయినేజీలో సిల్ట్ తీయగా సుమారు పది ట్రాక్టర్లు మట్టి ఉంటుందని అన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్: స్వయం ఉపాధి పథకం కింద రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వారు రుణాలకు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ, విద్యార్హత, పాస్‌పోర్టు ఫొటోలతో ఈ నెల 22వ తేదిలోపు గ్రామ, వార్డు సచివాలయం, మీ–సేవా, ఇంటర్నెట్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రాలను రెండు సెట్లు చొప్పున మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెల్పడం పట్ల పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తెన్నేటి జగ్జీవన్ హర్షం ప్రకటించారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ఎస్సీలోని మాదిగ, ఉపకులాలు విద్యా, ఉపాధి రంగాల్లో వెనుకబాటుతనం ఉందన్నారు. కులాలు సుదీర్ఘ పోరాటం ఫలించనున్నదని తెలిపారు. ఎంతో మంది కార్యకర్తలు ప్రాణ త్యాగాలతో అనేక అడ్డంకులు, అవరోధాలను వర్గీకరణ అంశం అధిగమించిదని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం అన్నారు. త్వరితగతిన వర్గీకరణ చేపట్టి నియమకాలు చేయాలని కోరారు. గెద్దాడ రాజు, మార్లపూడి మహేష్, మెరుపు సంతోషరావు, శీలి వెంకటాచలం, పెనుమాక రాకేష్, బొల్లిపో రత్నాజీ, ప్రేమ్‌కుమార్, పెదమూర్తి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న షెడ్డు పనులను మంగళవారం నిర్వాహకులు పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రూ.5 లక్షలతో భారీ షెడ్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వామివారికి ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు సమయంలో ఈ షెడ్డు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న బ్యాంక్ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంకు ఉద్యోగులు ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మె నిర్వహిస్తున్నట్లు, విజయవంతం చేయాలని యూఎఫ్‌బీయూ నాయకులు వెల్లడించారు. పట్టణంలో మంగళవారం పలువురు మాట్లాడుతూ ఢిల్లీలో సెంట్రల్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన సంప్రదింపులు విఫలమైనట్లు చెప్పారు. ఐబీఏ మొండి వైఖరి వల్ల బ్యాంకు ఉద్యోగులు రెండు రోజులు సమ్మె యథాతథంగా జరుగుతుందని చెప్పారు. సంవత్సరన్నర పైగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలోకి దిగినట్లు వెల్లడించారు. 22, 23 తేదీలు శని ఆదివారాలలో వారాంతపు సెలవులు కారణంగాను అదే విధంగా 24, 25 తేదీలు సోమ, మంగళవారం రోజులలో సమ్మె కారణంగా వరుసగా నాలుగు రోజులు పాటు దేశ వ్యాప్తంగా బ్యాంకింగ్ లావాదేవీలు నిలిచిపోతాయని చెప్పారు. అంతేగాక ఈ నెల 21వ తేదీన దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతాయని పట్టణంలోని ఎస్‌బీఐ ఈ కార్నర్ వద్ద నుంచి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు టీవీ సూర్యనారాయణ, ఎస్.ఎస్.ప్రసాద్, జి.జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీదేవి ఉత్సవాలు



11 రోజుల దీక్ష విరమణ సందర్భంగా గౌరీ మాలధారులు



పూజలందుకొంటున్న గౌరీదేవి అమ్మవారు

పెంటపాడు: మండలంలోని గ్రామదేవత గౌరీదేవి అమ్మవారి నూతన ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యసిద్ధి కోసం 11 రోజల పాటు ఆలయం వద్ద గౌరీమాల ధరించిన భక్తులు బుధవారం దీక్ష విరమించారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారిని తెప్పవాహనంలో కోనేరు చెరువులో ఊరేగించారు. భారీగా బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు దాసరి అప్పన్న, కిలపర్తి వెంకటరావు, బండారు నాగు, రెడ్డి సూరిబాబు, జామి కృష్ణ, సలుమూరి ప్రకాష్ లతో పాటు, ఎంపీపీ దాసరి హైమావతి, ఆడిటర్ దాసరి శ్రీనివాస్, అడ్వకేట్ దాసరి ప్రసాద్, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు దాసరి ప్రవీణ, దత్తి వెంకట్రావు, బండారు గోపి, నక్కా సాంబశివ, కళిరెడ్డి శ్యాంబాబు, బండారు వెంకట్రావు, వ(వ్రి వాసు, బీమవరపు శ్రీనివాస్, పలు ప్రాంతాల నుంచి మాలధరించిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- సౌకర్యాల పేరుతో కుప్పకూలుతున్న వృక్షాలు
- పెరుగుతున్న ఎండ వేడిమి
- 36 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదు



రామన్నగూడెం - జగ్గన్నపేట రహదారిలో చెట్లను నరికివేసిన దృశ్యం



పెదతాడేపల్లి సెంటర్ నిర్మానుష్యంగా మారిన దృశ్యం



ఎండ తీవ్రత నుంచి రక్షణగా తలపై చున్నీలను ధరించి వెళ్తున్న విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్: ఈ ఏడాది ఎండలు ప్రజానీకాన్ని తారెత్తిస్తున్నాయి. మార్చి నెలలోనే రోహిణి కార్తెను తలపించే విధంగా ఎండలు కాయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పూర్తి స్థాయిలో వేసవి ప్రవేశించకుండానే ఎండలు మండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాడేపల్లిగూడెం పట్టణంలోని పోలీస్‌ఐలాండ్ సెంటర్, తాలూకాఫీస్, గొల్లగూడెం, హౌసింగ్ బోర్డు, పెదతాడేపల్లి సెంటర్‌లో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతానికే నిర్మానుష్యంగా మారుతున్నాయి. దీన్ని బట్టి ఎండ తీవ్రత ఎలా ఉందో అర్థమవుతుంది. ఉదయం 8.30 గంటల వరకు మంచు కురుస్తున్నప్పటికీ ఆ తర్వాత భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీన్ని చూసిన ప్రజలు ఈ వింత వాతావరణం ఏమిటని చెవులు కొరుక్కుంటున్నారు. గత ఏడాది వర్షాలు, చలికాలంలో సైతం చలి గాలులు సైతం లేని పరిస్థితి. వీటన్నింటి దృష్ట్యా ఈ ఏడాది ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అంచనాలను నిజం చేస్తూ మార్చి నాల్గవ వారంలోనే ఎండలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పగటి పూట 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక ఏప్రియల్, మే నెలల్లో ఏ మేర ఎండలు కాస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉదయమే పనులపై వెళ్లి మధ్యాహ్నం పనులు ముగించుకుని ప్రజలు ఇంటికి చేరుతున్నారు. తిరిగి సాయంత్రమే బయటకు వచ్చే పరిస్థితి నెలకొంది. పట్టణాలతో పాటు పరిసర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

సౌకర్యాల పేరుతో కుప్పకూలుతున్న వృక్షాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే వృక్షాలు సౌకర్యాల పేరుతో కుప్పకూలుతున్నాయి. దీంతో ఒకనాడు చల్లని వాతావరణానికి నిలయంగా ఉండే గ్రామీణ ప్రాంతాలు సైతం ఎండ తీవ్రత అల్లాడిపోతున్నాయి. దీనికి వృక్షాలను విచ్చలవిడిగా నరికివేయడమే కారణమని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని రామన్నగూడెం – జగ్గన్నపేట, తాడేపల్లిగూడెం – వెంకట్రామన్నగూడెం వంటి రహదారులు ఒకనాడు మొక్కలతో కళకళలాడేవి. నేడు వృక్షాలు లేక ఈ రహదారులు కళావిహీనంగా మారాయి. దీంతో చల్లని గాలులు వీచే పరిస్థితి లేదు. చెట్లను నరికి వేసినా వాటి స్థానే మొక్కలను నాటవలసిన అవసరం ఉంది. అయితే, అటువంటి దాఖలాలు కానరావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కాంక్రీట్ రహదారుల కారణంగా వాతావరణంలో వేడిశాతం పెరిగింది. దీనికితోడు వృక్షాలను నరికివేయడంవల్ల వాతావరణం మరింత వేడెక్కే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటిని ఎక్కువగా తీసుకోవాలి



ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి ఎక్కువగా మంచినీటిని తాగాలి. కాటన్ దుస్తులను ధరించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపై వెళ్లే సమయంలో ఎండ నుంచి రక్షణకు టోపీ, రుమాలు వంటివి వినియోగించాలి. వేసవి రక్షణ చర్యలు పాటించడం ద్వారా వడదెబ్బ నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

– డాక్టర్ వీరవెంకటేష్, వైద్యాధికారి, మాధవరం పీహెచ్‌సీ, తాడేపల్లిగూడెం